ఏఐటీయూసీ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - పెందుర్తి: ఏఐటీయూసీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 13వ జిల్లా మహాసభలు విశాఖ నగరంలో ఈనెల 12, 13 తేదీల్లో జరుగుతాయని పెందుర్తి సివిల్ సప్లై గొడౌన్ కళాశీల సంఘం ఏఐటీయూసీ ప్రతినిధులు తెల్లి రామకృష్ణ, దమ్ము మరిడయ్య తెలియజేశారు. ఈ సభలను విజయవంతం చేయాలని కోరుతూ పెందుర్తి సివిల్ సప్లై గొడౌన్ వద్ద గోడపత్రిక, కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించడానికి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాసభలు దోహదపడతాయని తెలిపారు. నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆశీల మెట్ట నుంచి రామా టాకీస్ వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించి సభలో పాల్గొంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాసిలు దమ్ము రాజు, నూకరాజు, శ్రీరాములు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్లు నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో కణమాం గ్రామపంచాయతీలో మూడవ వార్డు మెంబర్ ఏరుకొండ సాధమ్మ అకాల మరణం కారణంగా ఏర్పడిన ఖాళీ వార్డ్ మెంబర్ స్థానానికి ఏరుకొండ కృష్ణకుమారి అనే మహిళ మండల ఎన్నికల అధికారి ఎంపీడీవో అడపా లవరాజుకు నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు బంక సత్యం, పంచాయతీ నాయకులు వినిశెట్టి సింహాచలం నాయుడు, ఎర్ర అప్పలనాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమ్మెద అప్పలసూరి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే వెల్లంకి, పాలవలస పంచాయతీలకు సంబంధించి వార్డు మెంబర్లు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

ప్రజానేత చంద్రబాబుపై కేసులా...

విశాలాంధ్ర - భీమిలి: అభివృద్ధికి ఆద్యుడు, మచ్చలేని రాజకీయ జిజ్ఞాసి, ప్రజా నాయకులు నారా చంద్రబాబు నాయుడుపై పోలీస్ కేసులు పెట్టడం అప్రజాస్వామికమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పెందుర్తి నియోజకవర్గం పరిశీలకులు గంటా నూకరాజు మండిపడ్డారు. పుంగనూరులో జరిగిన సంఘటనపై గంటా నూకరాజు మాట్లాడారు. ప్రతిపక్ష నేత పర్యటనకు వెళితే వైసీపీ నాయకులు, కార్యకర్తలకు అక్కడ పనేంటని ప్రశ్నించారు. కావాలనే ప్రణాళిక ప్రకారం మంత్రి పెద్దిరెడ్డి చొరవతో చంద్రబాబుపై, టీడీపీ కార్యకర్తలపై రాళ్లు వేశారని అన్నారు. దీనిపై వైసీపీ నాయకులే తిరిగి కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందని అన్నారు. నారా చంద్రబాబు నాయుడుపై కేసులు పెడితే భయపడేది లేదని, ఇలాంటి పనికిమాలిన కేసులు ఆయన జీవితంలో ఎన్నో చూశారని అన్నారు.

పరిశుభ్రత పాటించాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: ప్రతి విద్యార్థి చిన్ననాటి నుండే పరిశుభ్రత పాటించి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని మండల విద్యాశాఖ అధికారి కె.సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని పలు జెడ్పీ హైస్కూళ్లలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఇళ్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా ఇంటిలో ఉన్న ప్రతి ఒక్కరికి పరిశుభ్రతపై అవగాహన కల్పించే బాధ్యత ప్రతి విద్యార్థికి ఉందని అన్నారు. అనంతరం వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 డివిడి ప్రసాద్, కె.కోటపాడు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి పాల్గొన్నారు.

అమరవీరులను స్మరించుకోవడం మన విధి

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరిలో 'నా మట్టి- నా దేశం' కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి పాల్గొన్నారు. దేశ రక్షణ కొరకు వారి కుటుంబాలను సైతం విడిచిపెట్టి దేశ సరిహద్దుల్లో నిత్యం కాపు కాస్తు అసువులు బాసిన అమరవీరులను స్మరించుకోవడం మన విధి అని ఎంపీపీ అన్నారు. ఈ నేల తల్లి లేనిదే మన మనుగడ లేదని దాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని ఆమె అన్నారు.

అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దీసరి గంగరాజు, సర్పంచ్ సోమెల రూతు, కో ఆప్షన్స్ సభ్యుడు షేక్ మదీనా, ఎంపీడీవో ఏవివి కుమార్, ఏపీవోలు అర్జున్, నాయుడు, ఈసీ పవన్, సూపరింటెంట్ ఏవో లక్ష్మీనారాయణ, సీనియర్ అసిస్టెంట్ రామచంద్రరావు, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది ఏపీఎం సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా కొనసాగింది. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యమైన శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో సమావేశం తూతూ మంత్రంగా కొనసాగింది. వ్యవసాయ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ, ఆర్ అండ్ బి, విద్యాశాఖ, హౌసింగ్, ఐసీడీఎస్, పంచాయతీ రాజ్, రెవెన్యూ తదితర శాఖాధికారులు తమ తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఆయా పంచాయతీల ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, ఎంపీడీఓ హేమసుందరరావు, సపంచులు సిరిపురపు అప్పలనాయుడు, వెన్నెల అప్పారావు, కన్నూరు దేవి, చింతకాయల సుజాత ముత్యాలు, పెదిసెట్టి పూజ, ఎంపీటీసీ పైలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాలలో మౌలిక సదుపాయాలకై సర్వే

విశాలాంధ్ర - పెదబయలు: మండలంలో గల అన్ని శాఖల అధికారులతో సచివాలయ సిబ్బందితో గురువారం మండల అభివృద్ధి అధికారి ఎల్.పూర్ణయ్య ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి ఆది ఆదర్శ గ్రామీణ యోజన పథకం ద్వారా మండలంలో మొత్తం 12 గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. గ్రామాలలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది ద్వారా ఆయా

గ్రామాలలో మౌలిక సదుపాయాలు, వ్యక్తిగత సదుపాయాలు, స్కిల్ డెవలప్మెంట్, వ్యవసాయ సంబంధిత పరికరాలు, అలాగే గ్రామాలలో మంచినీటి వసతి పాఠశాల, అంగన్వాడి భవనాలు మరమ్మతులు, మురుగు కాలువలు, సిసి రోడ్లు, విద్యుత్ వంటి అవసరాలను గుర్తించి సర్వే నిర్వహించి ప్రతి గ్రామానికి 20 లక్షల 38 వేలకు తగ్గకుండా ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. ఈనెల 11వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఈ సర్వేను నిర్వహించాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ కృష్ణారావు, ఈవోఆర్డీ నరసింగరావు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనితని కలిసిన కొరుప్రోలు పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని అడ్డరోడ్డులో పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితను కొరుప్రోలు టిడిపి నాయకులు ప్రత్తిపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో సర్పంచ్ అభ్యర్థి కర్రి సూర్య వేణి మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తరపున బలపరిచిన అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొరుప్రోలు ఇన్‌ఛార్జ్ సర్పంచ్ కోరపాటి గోపాలం, టిడిపి నాయకులు కోర రామారావు, యర్ర చిన్న, చేకూరి పెద అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - తగరపువలస: మోసిన్ స్కూల్ హెల్త్ ఐ కేర్ ప్రాజెక్ట్ సౌజన్యంతో విశాఖపట్నం ఐ బ్యాంక్ రీసెర్చ్ ట్రైనింగ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భీమిలిలో ఉన్న కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ గంగా కుమారి తెలిపారు. డా. సాయి క్రిష్ణ కుమార్, సిహెచ్.వంశీకృష్ణ నేతృత్వంలో వైద్య బృందం, సంస్థ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 270 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా వారిలో 16 మందికి ఉచితంగా కంటి అద్దాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది కె. రమణ, ఏ.శాంతి, పి.రమ్యశ్రీ, బి.సూరి దేవుడు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

విశాలాంధ్ర - వి.మాడుగుల: విలేజ్ రికాంట్రెక్షన్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవ సంస్థ వారు మాడుగుల మండలం జాలంపల్లి, ఎల్.పొన్నవోలు పంచాయతీలో ఎల్.పొన్నవోలు, కామకుటం, కొండవీది, ఎల్.కొత్తపల్లి, జాలం పల్లి, బి.జాలంపల్లి, గొప్పులపాలెం, రావిపాలెం, సిరిపురం గ్రామాలలో 300 మంది పేద పిల్లలకు చదువుకు కావలసిన విద్యా సామగ్రి అందించారు. వీఓ కమలాకర్ మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకోవాలని, మంచి ఉద్యోగాలు సంపాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ చిన్ని రవికుమార్, వాలంటీర్లు బి.వెం కటేష్, టి.దొరబాబు, కె.నాని, వెంకటరమణ(సిడబ్ల్యూ), కమ్యూనిటీ వర్కర్స్ ఎం.గటీలు, ఎస్.అప్పల కొండ, లక్ష్మి, ఎస్.రాణి, ఎల్.జానకిదేవి, జి.నానాజీ. బి.భవానీ, చంద్రవతి, సిహెచ్. మాధురి, పిల్లల తల్లిదండ్రులు స్కూల్ చైర్మన్స్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో నా దేశం నా మట్టి

విశాలాంధ్ర - అరకులోయ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా డిగ్రీ కళాశాల జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో బుధవారం మేరీ మాటీ మేరీ దేశ్ కార్యక్రమంను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథులుగా పాల్గొన్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ భరత్ కుమార్ నాయక్, సిహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ మన అమర జవాన్లను, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన పౌరులు గౌరవించటానికి స్వతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15 వరకు దేశవ్యాప్తంగా మేరీ మాటీ మేరీ దేశ్ (మాట్టి... నా దేశం) పేరిట మన ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన ఈ ప్రతిష్టమైన కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమని చెప్పారు. విద్యార్థులు దేశ ప్రగతికి కృషి చేయాలన్నారు. ఈ క్రమంలో ఎన్ఎస్ఎస్ పి ఓ లు పీ నాగబాబు, వై విజయలక్ష్మి, ఎం అనిత కుమారి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె పుష్పరాజు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ పి కొండబాబు, అధ్యాపకులు సుందర్ రాణి, కృష్ణ ,మోహన్ గురయ్య, రాజు ,గోపాలకృష్ణ సంధ్య, కామేశ్వరరావు, ఎస్ అప్పారావు ,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

సీసీఎల్ఏ ప్రధాన కమిషనర్ సిద్ధార్ద్ జైన్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రీసర్వే ప్రక్రియ ప్రభుత్వ నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని సీసీఎల్ఏ ప్రధాన కమిషనర్ సిద్ధార్ద్ జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాలో జరుగుతున్న రీ సర్వే ప్రగతి గూర్చి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా రీసర్వే పనులు పూర్తి చేయాలన్నారు. వివిధ కార్యకలాపాల సమయంలో రీసర్వే సిబ్బంది ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలు, సాఫ్ట్వేర్ సమస్యలు, ఇతర సమస్యల గురించి చర్చించారు. జిల్లా కలెక్టరు డా.ఎ.మల్లిఖార్జున మాట్లాడుతూ ఫైనల్ ఆర్.ఒ.ఆర్. పూర్తయిన గ్రామాలలో స్టోన్ ప్లాంటేషను పూర్తిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో నిర్ణీత షెడ్యూలు ప్రకారం రీసర్వే పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.యస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఆర్డీఓలు బాస్కర్ రెడ్డి, హుస్సేన్ సాహెబ్, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ సూర్యరావు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతోనే ఆరోగ్యం: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: నులి పురుగుల నివారణతోనే ఆరోగ్యం మెరుగు పడుతుందని, విద్యా వికాసం పెరుగుతుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక లోచలిపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని కలెక్టర్ ప్రారంభించారు. కడుపులో నులి పురుగులు మనం తినే ఆహారాన్ని ఒంటికి పట్టనివ్వకుండా చేస్తాయని తద్వారా అనారోగ్యం పాలవటమే కాకుండా మనం తినే ఆహారంలో పౌష్టికత లోపించటం జరుగుతుందన్నారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు చప్పరించటం కాని, నమలటం కాని చేయాలని తద్వారా నులి పురుగులు నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డా. జమాల్ బాష, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాగజగదీష్‌కు చంద్రబాబు అభినందన

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్వతీపురం పర్యటన సందర్భంగా బాబును కలిసిన బుద్ధ నాగ జగదీష్ అనకాపల్లిలో మంత్రి అమర్నాథ్ వైఖరి గురించి భూకబ్జాల గురించి చంద్రబాబునాయుడుకు వివరించారు. అనకాపల్లి వివి రమణ సహకార చక్కెర కర్మాగారానికి చెందిన 350 కోట్లు విలువ గల 34 ఎకరాలు భూమిని మంత్రి అమర్నాథ్ కాజేయడానికి పన్నిన కుట్రను హైకోర్టు ద్వారా అడ్డుకున్నామని, ఇందుకుగాను ఈ ప్రాంత రైతాంగం సంతోషం వ్యక్తం చేస్తున్నారని జగదీష్ చంద్రబాబుకు వివరించారు. దానికి స్పందించిన బాబు జగదీష్‌ను అభినందించారు. కష్ట కాలంలో రైతులకు మంచి సహకారం అందించారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు తరువున హైకోర్టును ఆశ్రయించడం ద్వారా మంచి పరిణామం జరిగిందని బాబు పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగం నిర్మించుకున్న వివి రమణ చక్కెర కర్మాగారాన్ని తెరిపించి పూర్వవైభవాన్ని తీసుకురావాలని జగదీష్ చంద్రబాబు నాయుడుని కోరారు.

ఘనంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పుట్టినరోజు వేడుకలు పాయక రావు పేటలో వైసీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. జాతీయ రహదారి వై జంక్షన్ వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, వైసీపీ జిల్లా ప్రచార కమిటీ విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు, సిబ్బందికి పాలు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లంకా సూర్యనారాయణ, మత్స్యకార కార్పోరేషన్ డైరక్టర్ చోడిపిల్లి శ్రీనివాసరావు, ఇనరపు తాతారావు, సర్పంచ్ వడాల సోమన్నదొర, గెడ్డమూరి శ్రీనివాసరావు, వంగల పూడి రామారావు, నీలాపు మహేష్‌రెడ్డి, పల్లెల వెంకట్, యజ్జల సత్యనారాయణ, పల్యాల లచ్చబాబు, గుజ్జు గోవిందరెడ్డి, తూము రాజబాబు, కేశనకుర్తి సత్తిబాబు, అంబటి రాంబాబు, నెలపర్తి నాగరాజు, పిరాధి రాజు, సలికే అచ్చియ్య, తుమ్మలపల్లి సతీష్, జొన్నకూటి సూరిబాబు, సాహిద్, నాగు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పీవీటీజీలకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలి

విశాలాంధ్ర - అరకులోయ: అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ 11 మండలాలు 244 పంచాయతీల పరిధిలో ఉన్న పీవీటీజీల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని వారికి కేటాయించాల్సిన ప్రత్యేక నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ తెలిపారు. అరకులోయ గిరిజన సంఘం కార్యాలయంలో అనంతగిరి అరకులోయ, డుంబ్రిగుడ మండలాల ముఖ్య కార్యకర్తల సమవేశం ఆదివాసి గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.రామన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో కోదు, పరెంగిపోర్జా, గదభ, పోర్జ తెగల పీవీటీజీలు 244 పంచాయతీల్లో 1664 గ్రామాల్లో సుమారు లక్ష 75 వేల మంది ఉన్నారని, అచ్చంగా పీవీటీజీలు 904 గ్రామాల్లో పాక్షికంగా, 759 గ్రామాల్లో సుమారు 40 వేల కుటుంబాలు ఉన్నాయని 2019లో జగన్మోహన్ రెడ్డి వైసీపీ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత అంత్యోదయకార్డులు రద్దు చేశారని అన్నారు. అర్హులైన పీవీటీజీలకు అంత్యోదయ కార్డులు తక్షణమే మంజూరు చేయలని అన్నారు. సబ్సిడీ రుణాలు, గ్రామాల్లో సీసీ రోడ్లు, మంచినీటి సౌకర్యాలు, కమ్యూనిటీ హాలు, అంగన్వాడీ, పాఠశాల భవనాలు ఇవ్వడం లేదని అన్నారు. దేశంలో ఉన్న పీవీటీజీలకు కేంద్ర ప్రభుత్వం 2023-25 సంవత్సరాలకు 15వేల కోట్లు ప్రకటించిందని పాడేరు ఐటీడీఏ పరిధిలో ఎంత కేటాయించారో నేటికీ సమగ్ర సమాచారం లేదని అన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు అప్పలరాజు, అప్పన్న, నగేష్, రాజు, సత్యారావు, యస్.ఐసుబబు, మాతృభాష విద్య వాలంటీర్ సంఘం జిల్లా అధ్యక్షులు కుమారి, బుజ్జిబాబు, ఎస్.అప్పన్న, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వారాహి సభకు అడుగడుగునా ఆంక్షలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర విశాఖలో తీవ్ర ఆంక్షలు మధ్య జరిగింది. ఎయిర్ పోర్టు దగ్గర నుంచి పవన్ బస చేసే దసపల్లా హెూటల్ వరకు పోలీసుల ఆంక్షలు నడమే కాన్వాయ్ సాగింది. విశాఖ ఎయిర్ పోర్టు జనసేన నేతలు స్వాగతం పలికేందుకు అధిక సంఖ్యలో తరలి వచ్చినప్పటికీ కొంతమందిని మాత్రమే అనుమతించారు. జనసేన నేతలు శివశంకర్, పంచకర్ల రమేష్ బాబు, కోన తాతారావు, పివిఎస్ఎన్ రాజు, కందుల నాగరాజు, పసుపులేటి ఉష కిరణ్, పంచకర్ల సందీప్, ఈఎన్ఎస్ చంద్రరావు, బొడ్డేపల్లి రఘు, మాగి శ్రీనివాసరావులను మాత్రమే ఎయిర్పోర్ట్ వద్ద అనుమతించారు. ఎయిర్ పోర్ట్ నుండి షీలానగర్ మీదుగా పోర్టు రహదారి ఫ్లైఓవర్ మీదగా వన్‌టౌన్ నుండి హెూటల్‌కు చేరుకుంది. కేవలం కాన్వాయ్‌లో ఆరు వాహనాలకు మాత్రమే అనుమతించారు. మరోపక్క జగదాంబ జంక్షన్ వద్ద వారాహి సభ వేదిక దారులన్నీ పోలీసులు మూసేశారు. జైల్ రోడ్డు నుండి వాహనాలను అనుమతించలేదు. గ్రీన్ పార్క్ హెూటల్ జంక్షన్ వరకు నుండి మూసివేశారు. విశాఖలో పవన్ సభను జరగనివ్వకుండా అడ్డంకులు సృష్టించి, ఆదరణ లేదని చూపించేందుకే వైసీపీ నేతలు ఈ పన్నాగం పన్నారని జనసేన నేతలు ఆరోపించారు.

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ రవిబాబుకి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - అనంతగిరి: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే కుంభ రవిబాబుకు ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్ర రామలక్ష్మి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రానికి మొట్టమొదటి ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా గిరిజనులకు ఎంతో సేవలు అందించిన రవిబాబును గుర్తించి అధిష్టానం ముఖ్యమంత్రి ఎమ్మెల్సీకి ఎన్నిక చేయటం గొప్ప విషయం అని భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించాలని ఆమె అన్నారు.

గీతం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వనసంరక్షణ

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్యర్యంలో స్థానిక మధురువాడ లోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో మేరీ మట్టి-మేరా దేశ్ నినాదంతో వనసంరక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎస్.ఎస్.ఎస్. కో-ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆర్.గోపినాద్, గీతం బయోటెక్నాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎస్.కె.ఖాశీబేబి, డాక్టర్ పద్మావతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎమ్.రాజాబాబు, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరుల ఆధ్వర్యంలో వాలంటీర్లు మొక్కలను నాటారు.

అప్పన్నను దర్శించుకున్న సీబీఐ డైరెక్టర్

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరహా లక్ష్మీనరసింహ స్వామి వారిని కేంద్ర బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ దర్శించుకున్నారు. వీరికి ఇంచార్జ్ కార్యనిర్వహణాధికారి వి.త్రినాథరావు అర్చక బృందంతో వేద పండితులతో నాదస్వరాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. కప్ప స్తంభం ఆలింగనం తదుపరి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట విశాఖపట్నం సిబిఐ ఎస్పీ, ఏసీపి నరసింహమూర్తి గోపాలపట్నం పోలీస్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్‌కు దువ్వాడలో హాల్ట్

విశాలాంధ్ర - గాజువాక సిటీ: దువ్వాడ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల వారు స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ హాల్ట్ కోసం సుదీర్ఘ కాలం ఎదురు చూసిన దువ్వాడ రైల్వే యూజర్స్ కల ఎట్టకేలకు నెరవేరింది. గురువారం స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ దువ్వాడ స్టేషన్‌కు చేరుకోవడంతో దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ప్రయాణికులకు హృదయ పూర్వక స్వాగతం పలికారు. స్టేషన్లో దిగిన వారికీ, ప్రయాణికులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీలు ఎంవీవీ సత్యన్నారాయణ, జీవీఎల్ నరసింహారావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ నుంచి కె.ఈశ్వర్, వి.జాషువా, వీర్రాజు, ఎంఎస్ఎన్ మూర్తి, లయన్స్ క్లబ్ కూర్మన్నపాలెం సభ్యులు మురలీధర్ రెడ్డి, కేవీ ప్రసాద్, కె .శంకర్‌రావు, సీతారామ రాజు, ప్రసాద్ నాయుడు, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారితే లక్ష్యంగా మహాశక్తి కార్యక్రమం

విశాలాంధ్ర - యలమంచిలి: యలమంచిలి మున్సిపాలిటీ పెదపల్లి గ్రామంలో గురువారం నియోజక వర్గ మహిళా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహాశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా వారు ప్రతి ఇంటికి వెళ్లి మహాశక్తి చైతన్య రథయాత్ర ద్వారా భవిష్యత్తు గ్యారెంటీ అని చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు, టౌన్ పార్టీ అధ్యక్షులు గొర్లె నానాజీ, తెలుగు రైతు అధ్యక్షులు కొటారు సాంబ, నియోజవర్గ తెలుగు మహిళాధ్యక్షులు ఊడి పుష్పలత, రాంబిల్లి మండలం తెలుగు మహిళ అధ్యక్షురాలు కొటారి దల్లమ్మ దేవి, అచ్యుతాపురం మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు లాలం శాంతి, మహిళా కమిటీ సభ్యులు రేబాక మాలతి, లాలం శాంతి , బొద్దపు నాగేశ్వరావు, దంట్ల వెంకటస్వామి, చేబోలు శ్రీను, బొద్దపు అశోక్ కుమార్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను ప్రారంభించిన పీఓ అభిషేక్

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలో గల సుజనకోట పంచాయతీలో గల నర్సిపుట్టు గ్రామంలో గిరిజన ప్రాథమిక పాఠశాలను గురువారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రాథమిక స్థాయిలో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి పటిష్టమైన పునాదులు వేయాలని అన్నారు. సర్వశిక్షా అభియాన్ నిధులు రూ.3 లక్షలు, ఐటీడీఏ నిధులు రూ.2 లక్షలు, పంచాయతీ నిధులు రూ.55 వేలతో ఆధునీకరించినట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నెలకు ఐదు బాలికల పాఠశాలలను సందర్శించి అక్కడ ఉన్న తాగునీరు, విద్యుత్ సమస్యలు, మరుగుదొడ్లు మెరుగుపరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ.కొండలరావు, ఎంపీడీవో రమేష్, విద్యాశాఖ అధికారి కృష్ణమూర్తి, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారి జప్పర్, వైద్యాధికారి ఎస్.రమేష్, సర్పంచ్ వి.రమేష్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చెప్పారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణలో నా భూమి నా దేశం, నేల తల్లికి నమస్కారం, అమరవీరులకు వందనం శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యాలయం ప్రాంతంలో 75 మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరవీరులు మన దేశ స్వాతంత్రం కొరకు వీరోచిత పోరాట ఉద్యమాలు చేసిన విషయం అందరికీ విధితమేనన్నారు. అదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరు పర్యావరణంపై దృష్టి సారిచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, ఎంపీడీవో ఉషారాణి, తహశీల్దార్ నాగమ్మ, ఏటీడబ్ల్యూ మల్లికార్జునరావు, సర్పంచ్ వెంకట్రావు, ఎంపీటీసీ గీత, ఎన్ఆర్ఈజీ ఏపీవోలు దొరబాబు, సంఘం నాయుడు టీఏ సింహాచలం, ఎఫ్ఏలు శాంతకుమారి, డా లిమ్మ, వైసీపీ మండల నాయకులు గోపాల్, సింహాచలం, కృష్ణారావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

VMRDA VISAKHAPATNAM METROPOLITAN REGION DEVELOPMENT AUTHORITY

'e' Procurement Tender Notice

VMRDA, Visakhapatnam is inviting tender on "e" Procurement Platform for 3 Nos. of works with a total ECV of Rs. 727.19 Lakhs with last dates varying from 23-08-2023 & 28-08-2023.

For Further details is logon www.apeprocurement.gov.in

Sd/-Metropolitan Commissioner, VMRDA

మృతుని కుటుంబానికి తక్షణ సాయం అందజేత

విశాలాంధ్ర - పెదగంట్యాడ: కష్టకాలంలో ఉన్నవారికి వైఎస్సార్ బీమా కొంతమేర ఆర్థిక భరోసాన్ని ఇస్తుందని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు అన్నారు. వార్డులోని యాతపాలెం సచివాలయ పరిధి అశోక్ నగర్‌కి చెందిన పుట్టా రవికుమార్ (47) ఇటీవల అకాల మరణం చెందారు. ఆ కుటుంబాన్ని కార్పొరేటర్ పరామర్శించారు. వైఎస్సార్ బీమా రూ.లక్షకు గాను తక్షణ సాయంగా పదివేల రూపాయలను మృతుని భార్య సంధ్యకు అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీ వరహాల రాజు, ఆర్పీ అనురాధ, వాలంటీర్ అనిత పాల్గొన్నారు.

మేయర్, కమిషనర్‌ల దృష్టికి వార్డు సమస్యలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డులోని కొన్నేళ్లుగా పట్టి పీడిస్తోన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మలకు వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు గురువారం వినతిపత్రాలు అందజేశారు. ఆయా సమస్యలపై ఇరువురితోను సుమారు గంటన్నర సేపు చర్చించారు. తొమ్మిది పనులకు సంబంధించి అంచనాలు రూపొందించి వాటికి టెండర్లు పిలవాలని కోరారు. రిటైనింగ్ వాల్స్, వీధి రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణం, గెడ్డల ఆధునీకరణ, భానోజీ కోలనీ స్కూల్, సామాజిక భవనం దుస్థితి, పార్కులు, వీధి దీపాలు తదితర సమస్యలను వివరించారు.

దళితజన బాంధవుడు స్వర్గీయ గద్దర్

విశాలాంధ్ర - గోపాలపట్నం: స్వర్గీయ గద్దర్ (గుమ్మడి విఠల్ రావు) సంస్మరణ కార్యక్రమం గోపాలపట్నం కళాసేవాపీఠం కార్యాలయంలో జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు పూలదండ వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు మాట్లాడుతూ విప్లవకారుడిగా, కవిగా, రచయితగా, గాయకుడిగా, నటుడిగా, దళితజన భాంధవుడిగా అన్ని పాత్రలు సమర్థవంతంగా పోషించిన మహావ్యక్తి గద్దర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సింహాచలం నాయుడు, మాజీ అధ్యక్షులు చందు సుబ్బారావు, మాజీ గౌరవ అధ్యక్షులు తాండ్రంగి రామారావు, రంగస్థలం నటులు గులిమి అప్పారావు, కె.ఎస్.ఆర్.రావు, శ్రీనివాస్‌రావు, పాణిగ్రాహి, రామచంద్రరావు, వెంకట్రావు, అండిబోయిన శ్రీను, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జనసేనానికి ఘన స్వాగతం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ ఉత్తరాంధ్రలో జరగబోయే 10 రోజుల వారాహి యాత్రలో భాగంగా నగరానికి వచ్చిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు జనసేన పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. విశాఖ ఎయిర్పోర్ట్ నుండి రోడ్డు మార్గాన నగరంలోని దసపల్లా హోటల్‌కు చేరుకున్నారు.

మాధవ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - గాజువాక : బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పివియన్ మాధవ్ పుట్టినరోజును నాయకులు వేడుకగా నిర్వహించారు. గురువారం కూర్మన్నపాలెం, అక్షిత గ్రాండ్ రెస్టారెంట్‌లో ఏపీ బీజేపీ మీడియా కోర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పివియన్ మాధవ్ మాట్లాడుతూ ఆప్తులు, అభిమానుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పొలిమేరుశ్రీను, దీనకొండ కృష్ణంరాజు, పావని, బీఎంయస్ నాయకులు ఎంవియస్ నాయుడు, మంగిన రామకృష్ణ, బ్రహ్మాజీరావు, వెంకట్రావు, కృష్ణంరాజు, గీతాసింగ్, హనుమంతురావు, మల్లికార్జునరావు, పట్టాభిరామయ్య, యస్ వి శ్రీనివాసరావు, కోడూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ ఆడిట్

విశాలాంధ్ర - రావికమతం: మండలంలో స్వచ్ఛ సర్వేక్షన్ ఆడిట్ విజయవంతంగా జరిగింది. మండలంలో కవగుంట, పి.పొన్నవాలు గ్రామపంచాయతీలను స్వచ్ఛ సర్వేక్షన్ పథకంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆయా గ్రామాలను ఎంపిక చేశాయి. ఆడిట్ ప్రతినిధి మోహన్ ఈ రెండు గ్రామపంచాయతీలో ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కవగుంట గ్రామపంచాయతీలో జరిగిన స్వచ్ఛ సర్వేక్షన్ ఆడిట్ కార్యక్రమంలో పాల్గొన్న కవగుంట గ్రామ సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు, విరోధి రాజారావులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, చెత్తతో సంపద తయారీ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాలు, డ్రైనేజీ వ్యవస్థ తదితరాలపై తనిఖీ నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గంగాభవాని, పంచాయతీ కార్యదర్శి స్వామి, వాలంటీర్ రవి, గ్రీన్ అంబాసిడర్ కళ్యాణం, అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ, ఆయా లక్ష్మి పాల్గొన్నారు.

నా మట్టి - నా దేశం

విశాలాంధ్ర - రావికమతం: నా మట్టి - నాదేశం, నేల తల్లికి నమస్కారం - వీరులకు వందనం కార్యక్రమంతో జాతీయత, సమైక్యత భావం పెంపొందుతుందని కొత్తకోట సబ్ ఇన్‌స్పెక్టర్ విభీషణరావు అన్నారు. నా మట్టి - నా దేశం, వీరులకు వందనం కార్యక్రమం కొత్తకోట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం నందు గురువారం నిర్వహించారు. కొత్తకోట గ్రామ ఉపసర్పంచ్ వందల దేవ, ఎంపీటీసీ కుంచా శంకర్, జిల్లా వైసీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గుమ్మడి దొరబాబు, సచివాలయ కన్వీనర్ భీమరాతి వెంకట్, విశ్రాంత ఉపాధ్యాయులు బేత నూకరాజు, గుమ్మడి ప్రకాష్‌రావు, విశ్రాంత సబ్ ఇన్స్పెక్టర్ పాణిగ్రాహి, పంచాయతీ ఈవో కృష్ణమోహన్, పంచాయతీ వార్డు సభ్యులు వడిగొండ శ్రీను, అడ్డూరి నాగభూషణం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వీఆర్పీ కోట బాబురావు తదితరులు మొక్కల్ని నాటి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం నూకరాజు, గుమ్ముడు ప్రకాష్‌రావు, పాణిగ్రహిని శాలువాతో సత్కరించారు.

ఆనందపురం: మండలంలోని బంటుపల్లి వారి గ్రామపంచాయతీలో కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపడుతున్న నా భూమి - నాదేశం, వీరులకు వందనం కార్యక్రమం సర్పంచ్ కోన పైడిరాజు ఆధ్వర్యంలో స్థానిక రామాలయం దగ్గర పంచాయతీలో ఘనంగా నిర్వహించారు.

ఉపాధ్యాయులు, నాయకులు చేత ప్రతిజ్ఞ చేయించి ఆయన చేతులు మీదుగా పర్యావరణ రక్షణలో బాగంగా మొక్కలు నాటి శిలా ఫలకాలు ఆవిష్కరణ చేసి మట్టి సేకరణ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడానికి వారిని ఉత్తేజ పరచడానికి ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కోన శ్రీను, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, వీఆర్పీ బంటుపల్లి శ్రీను, గండ్రెటి సూర్యనారాయణ, చందక అప్పలరాజు, వాలంటీర్లు లక్ష్మి, కుమారి, కావేరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యాళ్ళ వరహాలబాబు పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: తెలుగుదేశం పార్టీ నాయకులు, పాండురంగస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ యాళ్ళ వరహాలబాబు పుట్టినరోజు వేడుకలు పాయకరావుపేటలో ఆయన స్వగృహం వద్ద ఘనంగా జరుపుకున్నారు. పార్టీ నాయకులు, అభిమానులు, బంధువులు గజమాలతో ఘనంగా సత్కరించారు. అందరి సమక్షంలో యాళ్ళ వరహాలబాబు కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈసందర్భంగా మహిళా పారిశుద్య కార్మికులకు, పేదలకు చీరలు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుండి నాయకులు తరలి వచ్చి వరహాలబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో తోట నగేష్, మజ్జూరి నారాయణరావు, యేజర్ల వినోద్‌రాజు, లాలం కాశీనాయుడు, యాళ్ళ సురేష్, మల్లపురెడ్డి రమాకుమారి, నారపురెడ్డి పద్మావతి, కశింకోట సత్తిబాబు, దేవవరపు వెంకట్రావు, చిక్కాల శ్రీను, చింతలపు ప్రదీప్, జూరెడ్డి రమేష్, దేవవరపు శ్రీనివాసరావు, గోసల శ్రీకాంత్, దాసరి అప్పారావు, మలిపెద్ది వెంకటరమణ, ఆచంట దొర, దువ్వి శ్రీనివాస్, మలిపెద్ది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: నా భూమి - నాదేశం, నేల తల్లికి నమస్కారం - వీరులకు వందనం కార్యక్రమంతో జాతీయత, సమైక్యత భావాలు పెంపొందుతాయని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య లు అన్నారు. నా భూమి - నా దేశం, మట్టి ప్రమాణాలు వీరులకు వందనాలు అనే కార్యక్రమాన్ని మండలంలోని తాజంగి పంచాయతీ కేంద్రంలో ఆ పంచాయతీ సర్పంచ్ వంతల మహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 9 నుంచి 15 వరకు గ్రామపంచాయితీలు, మండల ప్రధాన కార్యాలయాలు, గ్రామ గ్రామాన ఈ కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన నేపథ్యంలో తాజంగి పంచాయతీ కేంద్రంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో శెట్టి కొండబాబు నేతృత్వంలో ఎంపీడీవో ఆశాజ్యోతి, స్థానిక సర్పంచ్ మహేశ్వరిలతో కలిసి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీపీ అనూష దేవి, జెడ్పీటీసీ బాలయ్యలు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది తో పాటు, సచివాలయ సిబ్బంది ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు పరేడ్‌కు ఆదర్శ్ కళాశాల విద్యార్థినీల ఎంపిక



విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కళాశాల నుండి 29 మంది విద్యార్థినీలను విశాఖపట్నం జిల్లా పోలీస్ బ్యారెక్స్‌లో జరిగే 76వ స్వాతంత్ర్య దినోత్సవ మార్చ్ ఫాస్ట్‌కు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఈ. ఫ్లోరా తెలియజేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పెరేడ్ కొరకు ఎంపిక చేయబడిన విద్యార్థినిలకు కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందజేస్తామని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి జాన్ తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ టి.తియోఫిలస్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం విద్యాసంస్థల ద్వారా భారత విద్యార్థిని విద్యార్థులను ప్రోత్సహించే ఎన్నో అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవిబాబు పాల్గొని ఎంపికైన విద్యార్థినీలను అభినందించారు. ఆదర్శ్ డిగ్రీ కళాశాల మూడు యూనిట్ల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు గౌతం బాబు, అచ్చమ్మ, మంజుల ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రూ.14 లక్షలతో పూలుగుడ చెక్‌డ్యాం

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి మండల పరిధిలో గల టోకూరు పంచాయతీ హెయిర్ పిన్ బెండ్ 7 పూలుగుడ చెక్ డామ్‌కు 14 లక్షలు మంజూరైంది. నిర్మాణ పనులను ఎస్.ఎమ్.ఐ డి.ఇ జగదీష్, అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు, టోకూరు సర్పంచ్ కిల్లో మోస్యవైస్ సర్పంచ్ గెమ్మెల నర్సన్న, ఎస్.ఎమ్.ఐ జే.ఇ త్రినాథ్, నరాజీ సురేష్ తదితరులు పరిశీలించారు.

నిబంధనల మేరకే ఓటరు సర్వే: కలెక్టర్ మల్లిఖార్జున

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో ఓటరు లిస్టు వెరిఫికేషను, ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమం నిబంధనల మేరకు జరుగుతున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా ఇంటింటి ఓటరు సర్వేపై జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి ఓటరు సర్వేకు సంబంధించి జిల్లాలో 55% పూర్తయిందని తెలిపారు. సర్వే ప్రక్రియ సజావుగా సాగుతుందని, ప్రజలు బియల్ఓలకు సహకరిస్తున్నట్లు తెలియజేసారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి ఇంటింటి సర్వేను పూర్తి చేస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో రెండు సమావేశాలు నిర్వహించడం జరిగిందని, ఒకే డోరునెంబరులో 10 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న వివరములు, నూరు సంవత్సరములు దాటిన వారి వివరములు పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ కె.యస్.విశ్వనాథన్, ఆర్డీఓలు హుస్సేన్ సాహెబ్, బాస్కర్ రెడ్డి, ఇఆర్ఓలు, ఎఇఆర్ఓలు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధరణ చూసి ఓర్వలేక తప్పుడు కేసులు: టీడీపీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాజ్యాంగేతర శక్తిగా పాలిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి గద్దె దిగే రోజు దగ్గరపడిందని, విశాఖపట్నం పార్లమెంట్ అనుబంధ కమిటీలు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను ఖండిస్తూ నిరసన కార్యక్రమం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. విశాఖపట్నం పార్లమెంట్ అనుబంధ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు ఎక్కడికి వెళుతున్న జన నీరాజనాలు పడుతున్నారని, మన యువ నేత నారా లోకేష్ యువగళం పాదయాత్రకు అడుగడుగునా ప్రజా హారతులు పడుతుంటే అది చూసి ఓర్వలేక అక్కసుతో కుట్రలు చేస్తున్నారన్నారు.

బీసీ సెల్ అధ్యక్షుడు తమ్మిన విజయ్ కుమార్, విశాఖ పార్లమెంటు అనుబంధ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బుడుమురు గోవిందు, ఉరికూటి డేవిడ్, నక్క లక్ష్మిణ రావు, మొల్లేటి కుమార్ స్వామి, షేక్ రామ్ తుల్లా, రాజమండ్రి నారాయణ, గొల్లంగి ఆనందబాబు, టి.త్రినాథ్, బొట్ట వరదేశి యాదవ్, దాసన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అనసూయ మధు, గనగళ్ళ సత్య, మహమ్మద్ గౌస్, కాళీ ప్రసాద్, చిన్ని, పెద్దాడ పైడ్రాజు, రాజ్ కుమార్, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలకు వారాహి ఫీవర్ పట్టుకుంది

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జనసేన పేరు చెప్తే చాలు భయంతో వణికి పోతున్నారని, ఇప్పటివరకు లేని సెక్షన్ 30ని విశాఖ చుట్టుపక్కల పెట్టారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు. గురువారం పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇలాగే ప్రతిపక్షనేతగా జగన్మోహన్ రెడ్డి ఉన్నప్పుడు ఇదే ఆంక్షలు పెడితే, ఇదే సెక్షన్ 30 పెడితే జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర జరిగేదా అని ప్రశ్నించారు. ఒడ్డు దాటాక నావ తగల పెట్టినట్టు వైసిపి వ్యవహరిస్తుందని, వారాహి యాత్ర పేరు పెడితే ఎలా వస్తుందో చూస్తా అన్నారు, అసలు వారాహి రంగు సరికాదని అన్నారని, వారాహి వచ్చింది, రెండు విడతలు విజయ యాత్ర పూర్తి చేసుకుందని, విశాఖలో మూడో విడత అడుగుపెట్టిందని, వైసీపీ నేతలకు వారాహి ఫీవర్ పట్టుకుందన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న గుడివాడ అమర్నాథ్ మంత్రి అయిన రోజు నుండి ఎన్ని పరిశ్రమలు తెచ్చారని, ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సరే, ఓటర్లు సిద్ధంగా ఉన్నారని, మా జనసేన సిద్ధంగా ఉందన్నారు.

ఇంజనీరింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలి

విశాలాంధ్ర - రంపచోడవరం/దేవీపట్నం: ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన పనులన్నీ వేగవంతం చేసి సకాలంలో పనులు పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే ఇంజనీర్లను ఆదేశించారు. గురువారం స్థానిక ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వారి ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని ఏడు మండలాల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ వెల్ సెంటర్లు మండలాల వారిగా ఏ దశలో ఉన్నది ఆరా తీశారు. కాంట్రాక్టర్లతో ఎప్పటికప్పుడు చర్చించి పనులు పూర్తి చేసి ఎప్పటికప్పుడు ఎం బుక్‌లో నమోదు చేసి బిల్లులు అప్లోడ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, సత్యనారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గౌతమి, చైతన్య, శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సత్యనారాయణ, నాగరాజు, భాను, పి.వెంకటరమణ, మహేశ్వరరావు, ప్రసాద్, వంశీ, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు ఘటనపై సీబీఐ దర్యాప్తు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తల మీద చేయాల్సిన దౌర్జన్యాల్ని, పెట్టాల్సిన కేసులు సరిపోక ఇప్పుడు చంద్రబాబుపైన హత్యయత్నం కేసు పెట్టడం వైసిపి ప్రభుత్వానికి జగన్ రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయని అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ శాసనమండలి సభ్యుడు బుద్ధ నాగ జగదీశ్వరరావు జగన్ రెడ్డి పై విరుచుకుపడ్డారు. అంగళ్ల ఘటనలో వైసీపీ గుండాలు అరాచకాలతో పాటు పోలీసుల వ్యవహరించిన తీరు క్లియర్ కట్‌గా కనబడుతున్నా తిరిగి చంద్రబాబుపై కేసు నమోదు చేయడం అరాచక పాలనకు పరాకాష్టగా ఉందని జగదీష్ అన్నారు. స్థానిక శాసనసభ్యులు జిల్లా మంత్రి అమర్నాథ్‌కు ఏ పని చేతకాదని, మొరగడం ఒకటే తెలుసని చంద్రబాబు నాయుడుపై రౌడీ షీట్ ఓపెన్ చేయాలని పుంగనూరు దాడులకు చంద్రబాబే కారణమని చెప్పేముందు చంద్రబాబు వచ్చే సమయానికి పుంగనూరు నియోజవర్గంలో 6 మండలాల నుంచి కర్రలు రాళ్లు సమీకరించి నల్ల జెండాలతో చంద్రబాబు రాక కోసం ఎందుకు చూస్తున్నారో అమర్నాథ్‌కి దమ్ము ధైర్యం ఉంటే చెప్పాలని అన్నారు. గుడివాడ అమర్నాథ్ అనకాపల్లి ప్రజలకు చేస్తున్న ద్రోహం రాష్ట్రంలో ఇంతకు మించిన వారు ఎవరు ఉండరని ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే వారి ప్రయోజనాలకే కాకుండా సొంత ప్రయోజనాల కోసం ప్రజలు ఆస్తిని ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాధత్తం చేస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని, వారికి కొమ్ము కాస్తూ ఇంతకు మించి గజదొంగలు కూడా ఇటువంటి పనులు చేయరని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బోడి వెంకట్రావు, పొలిమేర నాయుడు, అండి బోయిన శేషు, సాలాపు నాయుడు, కాండ్రేగుల సత్యనారాయణ, దూలం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జహీరుద్దీన్ అలీఖాన్ మృతికి తెలంగాణ ప్రభుత్వమే బాధ్యత వహించాలి

విశాలాంధ్ర - చింతూరు: జారుద్దీన్ అలీ ఖాన్ ఈ నెల 7న గద్దర్ అంతిమ యాత్రలో పాల్గొని గుండె పోటుతో మరణించడానికి తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కెసిఆర్ బాధ్యత వహించాలని సిపిఐ మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖర్ ఈ అంతిమ యాత్రలో పాల్గొనడం మూలంగా అంతిమ యాత్రలో దొర తనాన్ని - ప్రదర్శం చాదానికి అంతిమ యాత్రలో పాల్గన్న ప్రజలపై లారి చార్జీ చేయదం మూలంగా ఆ తొక్కిస లాటలో జాహీరుద్దీన్ అలీ ఖాన్ గుండె పోటుతో మరణించారని విన్నామన్నారు. జాహిరుద్దీన్ అలీ ఖాన్ తెలంగాణ రాష్ట్రం మతోన్మాదానికి వ్యతిరేకంగా ఐక్య సంఘటనలో తను ప్రధాన బాధ్యత వహిస్తూ ప్రజలను సంఘటితం చేయడంలో కీలక పాత్ర పోషించాడని పేర్కొన్నారు. జర్నలిజంలో పని చేస్తూ ఉద్యమాలకు నాయకత్వ వహించాడని. ముస్లింలపై జరుగుతున్న మతోన్మావాద దాడులకు వ్యతిరేకంగా పోరాడాడన్నారు.

ముస్లిం ప్రజల హక్కుల కోసం నిరంతరం కృషి చేశాడని. మతోన్మావాదం అనేది ఏ మతంలో వుండకూడదని వాదించాడని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర దళారీ పాలక వర్గాల సామ్రాజ్యవాద, కార్పోరేట్ దోపిడి అనుకూల విధానాలను నిక్కచ్చిక బహిర్గత పరుస్తూ తన కలంతో ప్రజలను చైతన్య పరిచాడు.

పాలకుల నుండి ఒడుదొడుకులు, ఒత్తిళ్ళు ఎన్ని ఎదురైనా భయపడ లేదని. రాజీపడలేదన్నారు. లొంగి పోలేదని. ప్రజల్లో ప్రజల పక్షపాతిగా, ప్రజా స్వామ్య వాదిగా, సెక్యూలరిస్టుగా చెరగని ముద్రవేశాడని తెలిపారు. సామాజిక విప్లవం చేస్తున్న సిపిఐ (మావోయిస్టు పార్టీకి తన వంతు మద్దతును తెలుపుతూ స్థిరకాల సానుభూతి పరుడుగా నిలిచాడన్నారు. ప్రజా స్వామ్యవాది జహీర్ ఖాన్ కు పార్టీ తరుపున వినమ్రంగా సంతాపాన్ని తెలియజేసారు.

మాడుగులలో పశు విజ్ఞాన బడి

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టినాయుడు ఆధ్వర్యంలో మాడుగులలో పశు విజ్ఞాన బడి నిర్వహించి పశు సంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న లింగ నిర్ధారిత వీర్యం, సంపూర్ణ మిశ్రమ దాణా, 1962 అంబులెన్స్ సేవలు, డాక్టర్ వైయస్సార్ సంచార పశు వైద్య సేవలు, 75శాతం సబ్సిడీపై పశు గ్రాస విత్తనాల లభ్యత, పశు కిసాన్ క్రెడిట్ కార్డ్స్, ఉచిత ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం గురించి పాడి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ సౌజన్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలి

విశాలాంధ్ర - మాకవరపాలెం: ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలని, ఓటరు చేర్పులు, తొలగింపుపై అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి.జయరాం బిఎల్ఓలకు సూచించారు. గురువారం మాకవరపాలెం పంచాయతీలో బిఎల్ఓ ఆనంద్ 219 నెంబర్ బూత్ లో ఓటరు వెరిఫికేషన్ చేస్తుండగా ఆకస్మికంగా పరిశీలించారు. ఈయన వెంట తహశీల్దార్ ప్రసాదరావు, ఎలక్షన్ డిటి సుధావాణి, ఏఎస్ఓ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి తాగునీరు అందించడమే లక్ష్యం

విశాలాంధ్ర - మాకవరపాలెం: ప్రతీ ఇంటికీ తాగునీటిని అందించడేమ ప్రభుత్వ లక్ష్యమని మాకవరపాలెం వైస్ ఎంపిపి రుత్తల లక్ష్మీ అన్నారు. మండలంలో తామరం గ్రామంలో జరుగుతున్న జలజీవన్ మిషన్ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తి చేసి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు హరిబాబు, పంచాయతీ కార్యదర్శి బాలదొర, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జోత్స్న పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలిచిన విద్యార్థులకు బాడ్జిలు పంపిణీ

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని కనొస్సా ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఇటీవల నిర్వహించిన కేబినేట్ లీడర్స్ ఎన్నికల్లో గెలిచిన విద్యార్థులకు, క్లాస్ లీడర్స్‌కి బాడ్జిలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆర్‌సిఎం చర్చి ఫాథర్ మరియన్న, స్కూల్ ప్రిన్సిపాల్ సంతాన, మేనేజర్ అలెక్సిస, వైస్ ప్రిన్సిపాల్ ఫిలో, పీఈటిలు శ్రీను, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి జెడ్పీటీసీ పరామర్శ

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలోని గత్తు పంచాయతీ జిరుగుల పుట్టు గ్రామానికి చెందిన మజ్జి శోభన ఇటీల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాలు పాలై విశాఖ కేజీహెచ్లో చికిత్స పొందుతున్నారు. మండల జెడ్పీటీసీ రేగం మత్యలింగం ఆసుపత్రిలో సందర్శించి జరిగిన సంఘటన తెలుసుకుని ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

శ్రీనుని పరామర్శించిన బూడి

విశాలాంధ్ర -దేవరాపల్లి: మండలంలో నాగయ్యపేట గ్రామ పంచాయితీకి చెందిన ఎమ్ పిటిసి వంటకు పైడితల్లమ్మ భర్త అయినటువంటి వంటకు శ్రీను అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారని, తెలుసుకున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు నాగయ్యపేట గ్రామంలో ఉన్న శ్రీను ఇంటికి వెళ్లి పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకొని తగిన ఆరోగ్య పరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఉప ముఖ్యమంత్రి వెంట గ్రామస్థాయి అధికారులు,గ్రామస్తులు, నాయుకులు తదితరులు ఉన్నారు.

జాతీయ ఫెలోషిప్‌కు దరఖాస్తులు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం 2023-24 సంవత్సరానికి గాను ఎస్టీ విద్యార్థుల ఉన్నత విద్య కోసం స్కాలర్‌షిప్ పథకం కింద నేషనల్ ఫెలోషిప్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అనకాపల్లి జిల్లా గిరిజన సంక్షేమ సాధికార అధికారి వి.నాగ శిరీష తెలిపారు. పీహెచ్డీ/ఇంటిగ్రేటెడ్ M.Phil+Ph.D ప్రోగ్రామ్‌లను అభ్యసించడానికి ఎంపికైన అభ్యర్థులకు ఫెలోషిప్ ఇవ్వబడుతుందన్నారు. కేటాయించబడిన 750 స్లాట్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు https://fellowship.tribal.gov.in ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి ఈనెల 31 వరకు గడువు ఉందన్నారు. మరిన్ని వివరాల కోసం, అభ్యర్థులు మంత్రిత్వ శాఖ పైన సూచించిన పోర్టల్ సందర్శించవచ్చని తెలిపారు.

జీ తెలుగులో నిండు నూరేళ్ల సావాసం కొత్త సీరియల్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: తెలుగు ప్రేక్షకులకు వినోదం పంచడంలో తిరుగులేని ఛానల్ గా పేరుగాంచిన జీ తెలుగు. ఊహించని మలుపులు, ఆసక్తికర కథనాలతో సాగే సీరియల్స్ తో ఆకట్టుకుంటూ మరో సరికొత్త సీరియల్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతోందని జీ తెలుగు ప్రాంతీయ ప్రతినిధి వెల్లడించారు. ప్రేక్షకులకు అసలైన వినోదాన్ని అందించడంలో ముందుండే జీ తెలుగు సరికొత్త కథనాలు, ఆలోచింపజేసే ఇతివృత్తాలతో ఆసక్తికర మలుపులతో సాగే సీరియల్స్‌ను అందిస్తూ అలరిస్తోందన్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు రాత్రి 7 గంటలకు మీ జీ తెలుగులో ప్రసారం కానుందని తెలిపారు.

పోస్టాఫీసులలో జాతీయ జెండాల విక్రయం

విశాలాంధ్ర - దేవీపట్నం: ఆగస్టు 15ను పురస్కరించుకొని గోకవరం సబ్ డివిజన్ పరిధిలో గల సబ్ పోస్టాఫీస్‌లు పోస్టాఫీసులలో జాతీయ జెండా అమ్మకాలు చేపట్టినట్లు సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ సిహెచ్ తనూ నాయుడు గురువారం తెలిపారు. జాతీయ భావాన్ని పెంపొందించడానికి బాధ్యతగా ప్రతి పౌరుడు రూ.25కి విక్రయిస్తున్నట్టు తెలిపారు.

విశాలాంధ్ర
విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు

అమరవీరులను స్మరించుకుందాం

విశాలాంధ్ర – అనంతగిరి: దేశ సంరక్షణకు వారి కుటుంబాలను సైతం విడిచిపెట్టి దేశ సరిహద్దుల్లో నిత్యం కాపు కాస్తు అసువులు బాసిన అమరవీరులను స్మరించుకోవడం, అదేవిధంగా దేశ స్వాతంత్ర సిద్ధిలో భాగంగా అమరులైన స్వాతంత్ర వీరులకు నివాళులర్పించడం భారతీయులుగా మన విధి అని గుమ్మ కోట సర్పంచ్ పాగి అప్పారావు అన్నారు. భీమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం' నా మట్టి –నా దేశం కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వాతంత్ర దినోత్సవ సమీపిస్తున్న సమయంలో ఈ విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అందులో భాగస్వాములు ఉండడం గొప్ప వరమని అన్నారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో సుమారు 50 మొక్కలను నాటి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సంతోష్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు 11 నామినేషన్లు

విశాలాంధ్ర – పెదబయలు: గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి పెద్దకోడపల్లి సర్పంచ్ అభ్యర్థి కొరకు 8 నామినేషన్లను అదేవిధంగా ఇంజరిలో 8 వార్డులకు సంబంధించి మొత్తం 11 నామినేషన్లు దాఖలు అయ్యాయని స్థానిక ఎంపీడీవో ఎల్.ఫ్రెడ్డి తెలిపారు. అలాగే శుక్రవారం (నేటి) ఉదయం 8 గంటల నుండి నామినేషన్ల పరిశీలన కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించబడుతుందని, నామినేషన్ వేసిన అభ్యర్థులు లేదా ప్రతిపాదించిన అభ్యర్థులు మండల పరిషత్ కార్యాలయంలో హాజరు కావాలని కోరారు. నామినేషన్ స్వీకరణ కార్యక్రమంలో పెదకోడపల్లి స్టేజ్ వన్ ఎలక్షన్ అధికారి కే.కృష్ణమూర్తి, మండల విద్యాశాఖ అధికారి, పెదబయలు, ఇంజరి గ్రామ పంచాయతీ వార్డులకు నామినేషన్ స్వీకరించుటకు స్టేజ్ 1 ఎలక్షన్ అధికారిగా కే నర్సింగరావు ఈవోపీఆర్డీ పాల్గొన్నారు.

నులిపురుగుల వల్ల అనారోగ్య సమస్యలు

విశాలాంధ్ర – సీలేరు: బాల బాలికల్లో నులిపురుగుల వల్ల పలు రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డికె.హిమబిందు అన్నారు. డి

వార్మింగ్‌డేను పురస్కరించుకొని గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ టాబ్లెట్లను వేయించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ నులిపురుగుల వల్ల అజీర్తి, రక్తహీనత, ఆకలి మందగించడం తదితర సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ పోతురాజు, పీహెచ్ఎన్ రాణి తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

విశాలాంధ్ర – చింతూరు: బడి ఈడు గల బయట పిల్లలను తక్షణమే బడిలో చేర్పించాలని ఎంపీడీఓ వెంకటరత్నం అన్నారు. మండలంలోని ఉన్న ప్రతి ఒక్క వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ తమ తమ పరిధిలో ఉన్న స్కూల్స్‌ను శుక్రవారం వాలంటీర్లతో పాటు

సందర్శించి బడి బయట పిల్లల జాబితా తీసుకొని ఇంటింటికి వెళ్లి బడి మానివేసిన పిల్లలను, వారి తల్లిదండ్రులను ఒప్పించి వెంటనే సంబంధిత స్కూల్లో చేర్పించాలని వెల్ఫేర్ అసిస్టెంట్లను కోరారు. మండలంలోని చిడుమూరు, చట్టి, ఏడుగురాళ్లపల్లి, మోతుగూడెం సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నామని, కావున ఆయా సచివాలయాల్లో ఉన్న గ్రామ ప్రజలు మరియు ఆయా సచివాలయాల కు చేరువలో ఉన్న సచివాలయాల ప్రజలు ఆధార్ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలన్నారు.

రిలయన్స్ జువెల్స్ ఆభార్ కలెక్షన్ ఆవిష్కరణ

విశాలాంధ్ర/విశాఖపట్నం: ఆభరణాల పరిశ్రమలో విశ్వాసం, శ్రేష్టతకు పర్యాయపదంగా నిలిచిన పేరు రిలయన్స్ జువెల్స్ తన 16వ వార్షికోత్సవానికి గుర్తుగా ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న ఆభార్ కలెక్షన్ 2023ని ప్రారంభించింది. ఈ ప్రత్యేక వార్షికోత్సవ కలెక్షన్ రిలయన్స్ జువెల్స్ విజయానికి, తన పోషకుల మనసులలో గూడుకట్టుకున్నందుకు ఒక కృతజ్ఞతగా అందిస్తుంది. అద్భుతమైన డిజైన్లు, తిరుగులేని హస్తకళతో ఆభరణాల పరిశ్రమలో ఒక బ్రాండ్‌గా రిలయన్స్ జువెల్స్ గుర్తింపును ఏర్పరచుకుంది. బంగారు, వజ్రాల చెవిదిద్దుల ప్రత్యేక డిజైన్లు వినియోగదారులకు రిలయన్స్ జువెల్స్‌తో ఉన్న 16–సంవత్సరాల సుదీర్ఘ సంబంధాన్ని వ్యక్తపరుస్తాయి. ముఖ్యంగా ఈ కలెక్షన్, అన్ని వయసుల మహిళలకు పరిపూర్ణ అలంకారాలని అందించే విధంగా సునిశితంగా తయారు చేయబడిన బంగారం, వజ్రాలతో చెవిదిద్దుల డిజైన్లలో స్టడ్స్, సూయి ధాగ, జే–హూప్స్, డాంగ్లర్స్, ఫ్రంట్ అండ్ బ్యాక్ వంటి వైవిధ్యభరితమైన శ్రేణిని అందిస్తుందని రిలయన్స్ జువెల్స్ సీఈఓ సునీల్ నాయక్ తెలిపారు.

జలజీవన్ మిషన్ నిర్వహణకు శిక్షణ

విశాలాంధ్ర – చోడవరం: చోడవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు గురువారం ఎంపీపీ గాడి కాసులమ్మ అధ్యక్షతన, ఎంపీడీవో ఆధ్వర్యంలో టాటా ట్రస్ట్ వి.సి.ఎఫ్ వారి సహకారంతో, జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఆపరేషన్ మరియు నిర్వహణ పై వి. డబ్ల్యూ.ఎస్సీ సభ్యులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కు,ఎస్ హెచ్ జి మహిళలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆపరేషన్, నిర్వహణ పై మాడ్యూల్ ను ఎం.పి.పి., ఎంపీడీవో చైర్మన్ లు ఆవిష్కరించారు. అనంతరం ఈ శిక్షణ తరగతులలో క్లోరినేషన్, నీటి వనరుల నిర్వహణ, నీటి పన్నును నిలుపుకునే విషయంపై కమిటీలకు అవగాహన కల్పించారు. వాటర్ బిల్ ను ఏ విధంగా లెక్కించాలి అనే అంశంపై సెషన్లు తీసుకుని, వివరించారు. ఈ కార్యక్రమంలో టాటా ట్రస్ట్ కన్సల్టెంట్ జెవిఆర్ మూర్తి, జె.ఇ.ఎం. ఏటి టీం లీడ్ మనోజ్, సర్పంచుల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వి.డబ్ల్యూ ఎస్సీ సభ్యులు, ఎస్.హెచ్. జి మహిళలు మరియు, పంపు ఆపరేటర్లు పాల్గొన్నారు.

నులిపురుగులపై అవగాహన

విశాలాంధ్ర – దుంబ్రిగూడ: నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని దుంబ్రిగూడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా క్షయ వ్యాధి అధికారి విశ్వేశ్వరరావు నాయుడు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కడుపులో నులి పురుగులు ఉండడం వల్ల ఆకలి మందగిస్తుందన్నారు. దీంతో తినడానికి ఇష్టం లేక చిన్నారులు యుఖత అనారోగ్యాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. ఫలితంగా అనారోగ్యంతో

బక్కచిక్కుతారని ఆయన తెలిపారు. నులిపురుగుల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన అనంతరం విద్యార్థులకు నులిపురుగుల మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ప్రేమ, హెల్త్ సూపర్వైజర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ శెట్టి స్వామి, ఏఎన్ఎం లు, హెల్త్ సూపర్వైజర్, పాఠశాల అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

51% వృద్ధిరేటు నమోదు చేసిన రియల్‌మీ

విశాలాంధ్ర/విశాఖపట్నం: మోస్ట్ రిలయబుల్ స్మార్ట్‌ఫోన్ సర్వీస్ ప్రొవైడర్ రియల్‌మీ 2023 రెండవ త్రైమాసికంలో 51% అద్భుతమైన క్యూఓక్యూ వృద్ధిని సాధించింది. ప్రఖ్యాత మార్కెట్ పరిశోధన సంస్థ కౌంటర్ పాయింట్ నివేదించింది. 2023 క్యూ2 కోసం ఐడిసి ర్యాంకింగ్‌లో ప్రకారం టాప్ 10 స్మార్ట్‌ఫోన్ బ్రాండ్లలో నం. 3 స్థానాన్ని పొందడం ద్వారా ఈ అద్భుతమైన వృద్ధి భారతీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో రియల్‌మీ స్థానాన్ని బలపరుస్తుంది. భారతదేశంలో మొత్తం స్మార్ట్‌ఫోన్ మార్కెట్ క్యూ2లో 3% వైవై క్షీణతను చూసినప్పటికీ, రియల్‌మీ పూపాత్మకంగా రూ 10,000–రూ 15,000 విభాగంలోని 5జీ పరికరాలపై పరిశ్రమ దృష్టితో పాటు పోటీతత్వ ధర, లీప్–ఫార్వర్డ్ ఇన్నోవేషన్స్, బ్రాండును భారతీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో దాని గౌరవనీయమైన 3వ స్థానానికి తిరిగి నడిపించింది.

టొయోటా రూమియన్‌ను విడుదల చేసిన టొయోటా కిర్లోస్కర్ మోటార్

విశాలాంధ్ర – విశాఖ సిటీ: టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీ కే ఎం) సరికొత్త టొయోటా రూమియన్‌ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది ఆకర్షణీయమైన ప్రీమియం కొత్త ఫ్యామిలీ కార్ అని, సాటిలేని స్థలం, అద్భుతమైన ఇంధన సామర్థ్యంతో గొప్పగా చెప్పుకునే కొత్త కాంపాక్ట్ ఎం పీ వీ గా నిలుస్తుందని టీ కే ఎం బ్రాంచ్ మేనేజర్ తెలిపారు. ఇప్పటికే భారతీయ ఎమ్‌పివి విభాగంలో ముందంజలో ఉన్న ఈ సెవెన్ సీటర్ అధిక్రమణ మార్కెట్లో టయోటా ఉనికిని మరింత పెంచుతుందని భావిస్తున్నామన్నారు. పూర్తి సరికొత్త టొయోటా రూమియన్‌లో నియో డ్రైవ్ (ఐ ఎస్ జీ) టెక్నాలజీ ఈ– సీ ఎన్ జీ టెక్నాలజీతో కూడిన శక్తివంతమైన కే సిరీస్ 1.5–లీటర్ పెట్రోల్ ఇంజన్ పుందని చెప్పారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

విశాలాంధ్ర – ఎటపాక: మండల పరిధిలోని కుసుమపల్లి గ్రామంలో గ్రామస్తులు నీటి సమస్యను పరిష్కరించాలని గురువారం రహదారిపై మహిళలు ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత కొంతకాలంగా మంచినీటి సమస్యతో తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నామని, రెండు కిలోమీటర్ల దూరం నుంచి నీళ్లు

తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది అని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటరెడ్డి పేట గ్రామంలో కూడా చేతి పంపులు, పంచాయతీ మోటార్లు, మరమ్మతులకు గురయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ ఇర్పరాజమ్మ కారం కాసులు, సున్నం లక్ష్మీ, ఇర్పకాంతమ్మ, పాలమంచి శాంత, రమణమ్మ, అన్నపూర్ణ, కొవ్వాసి చిట్టెమ్మ, బుచ్చెమ్మ, ఇర్పమ్మ, సక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

చోరీని ఛేదించిన పోలీసులు

విశాలాంధ్ర – దేవీపట్నం: దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామంలో మూడు రోజుల క్రితం గ్రామంలోని మేడపాటి సత్యనారాయణ ఇంట్లో జరిగిన చోరీని దేవీపట్నం పోలీసులు ఛేదించారు. అదే గ్రామానికి చెందిన మాదాసు సాయి కిరణ్ నేరం చేసినట్టు పోలీస్ విచారణలో నిర్ధారణ కావటంతో దేవీపట్నం స్టేషన్ ఎస్సై కెవి నాగార్జున ముద్దాయిని గురువారం రంపచోడవరం ఏఎస్పీ ఎదుట హాజరు పరిచారు. ముద్దాయి నుంచి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దీని విలువ పదిన్నర లక్షలు వుంటుందన్నారు. కేసును అతి తక్కువ సమయంలో ఛేదించిన ఎస్సై నాగార్జున సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయ బోర్డు సభ్యురాలిగా ఎంపీ మాధవి

విశాలాంధ్ర – కొయ్యూరు: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ బోర్డు సభ్యురాలిగా ఎంపీ గొడ్డేటి మాధవి నియమితు లయ్యారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవిని వ్యవసాయ విశ్వవిద్యాలయ బోర్డు సభ్యురాలిగా నియమిస్తూ ప్రభుత్వం జీవో కాపీని విడుదల చేసినట్లు ఎంపీ కార్యాలయ సిబ్బంది తెలిపారు. తనపై నమ్మ కంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ అవకాశాన్ని కల్పించినందుకు ముఖ్యమంత్రికి ఎంపీ మాధవి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తానని ఆమె పేర్కొన్నారు. కాగా మాధవిని ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయ బోర్డు సభ్యురాలిగా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ పున:ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: బీచ్ రోడ్డులోని జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్సును మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌తో కలిసి గురువారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ 1995 సంవత్సరంలో ప్రారంభించబడిందని, ఇటీవల కరోనా కారణంగా రెండేళ్లు మూతబడిందని, ఈతగాళ్లతో పాటు శిక్షణార్థుల్ని దృష్టిలో పెట్టుకుని ఏడాది కాలంగా పలు మరమ్మతులతో పాటు గతానికి భిన్నంగా 15మంది బాలలకు ఉపయోగపడేలా బేబీ పూల్‌ను కూడా సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చల్లా రజని, పెద్దింటి ఉషశ్రీ సహా చీఫ్ ఇంజినీర్ రవికృష్ణంరాజు, నీటి సరఫరా విభాగ ఎస్ఈ వేణుగోపాల్, మెకానికల్ విభాగ ఎస్ఈ కృష్ణారావు, గాజువాక ప్రాంత ఎస్ఈ గోవిందరావు, జెడ్సీలు విజయలక్ష్మి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే బాబూరావు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర – యస్.రాయవరం: పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం మండలంలోని కొత్త ప్రోలు గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గంలోని పాయకరావుపేట నక్కపల్లి కోటవురట్ల ఎస్ రాయవరం మండలాల నుండి ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు అధికారులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి గోవిందు, జడ్పిటిసి కాకర దేవి, ఎంపీపీ కోన లోవ లక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ కొణతాల శ్రీనివాసరావు, నక్కపల్లి మండల వైసీపీ కన్వీనర్ సీరం నరసింహమూర్తి, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ ఎండి వెంకటేశ్వరావు, నక్కపల్లి సిఐ అప్పన్న, వైసీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, మాతా గురునాధరావు, అల్లాడ నాగరాజు, సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పంచాయతీ ఉప ఎన్నికల నామినేషన్ల గడువు

విశాలాంధ్ర – యస్. రాయవరం: మండలంలోని పలు గ్రామాల్లో జరిగే పంచాయతీ ఉప ఎన్నికల నామినేషన్ ధఖలు గడువు గురువారం సాయంత్రంతో ముగిసింది. కొరుప్రోలు పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికకు సంబంధించి ఐదు నామినేషన్లు దాఖలు చేయగా అందులో వైసీపీ తరఫున మూడు టిడిపి తరపున రెండు నామినేషన్లను దాఖలు చేశారు. గుడివాడ పంచాయతీలోని పదో వార్డు ఎన్నిక సంబంధించి దూళి అరుణ కుమారి, చిన్న గుమ్ములూరు ఐదవ వార్డుకు కాకర శివశంకర్, లింగరాజుపాలెం పంచాయతీ ఐదవ వార్డుకు కొమ్ము వరహాలు, కే నాగ నూక గౌరీ లు నామినేషన్లను ఎన్నికల అధికారి రాములు నాయుడుకు అందజేశారు. అయితే ఇందులోనే గుడివాడ చిన్న గుమ్ములూరు వార్డు నెంబర్ సంబంధించి ఒక్కో నామినేషన్

వేయడంతో దాదాపు ఏకగ్రీవం అయినట్లే. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పట్టణం అభివృద్ధి మౌలిక సదుపాయ కల్పన కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి గోవిందు, వైసిపి నాయకులు కొణతాల శ్రీనివాసరావు, పుట్ట సుధాకర్, మధువర్మ, టిడిపి నాయకులు ఎస్ వెంకట్రాజు, ప్రత్తిపాటి సత్యనారాయణ, కోరా రామారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి కృషి చేసిన రామస్వామికి సన్మానం

విశాలాంధ్ర – ముంచింగిపుట్టు: ముంచంగిపుట్టు మండలంలో గల జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు గ్రామానికి చెందిన వంతల రామస్వామి మూడుసార్లు జోలాపుట్టు పంచాయతీ సర్పంచ్ ఎన్నికయ్యారు. అప్పటినుండి సేవా దృక్పథాన్ని అలవాటు చేసుకున్న రామస్వామి గిరిజనుల విద్య, వైద్య అవసరాల కోసం తన పూర్వీకుల భూములను దానం చేశారు. లబ్బూరులో ట్రైబల్ వెల్ఫేర్ హైస్కూల్, పీహెచ్సీ ఏకలవ్య పాఠశాలల నిర్మాణానికి ఆయన తన ఆస్తిని దానంగా ఇచ్చారు. సుమారుగా 20 ఎకరాల భూమిని వీటి నిర్మాణానికి ఆయన విరాళంగా అందించారు. రామస్వామి గిరిజన అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తుల్లో ఒకరుగా నిలిచారు. ఈ సేవల్ని ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీఓ అభిషేక్, ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ అరకోరు సుభద్ర, పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఆంధ్రప్రదేశ్ ట్రై కార్ చైర్మన్ సతక బుల్లి బాబు జ్ఞాపిక, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. గత తెలుగుదేశం పార్టీ ఎన్టీ రామారావు ముఖ్యమంత్రి హయాంలో లబ్బూరు గ్రామంలో గల నిరుపేద కుటుంబాలకు సుమారు గా 6ఎకరాల భూ దానంగా ఇవ్వటంతో 32 మందికి ఇల్లు నిర్మాణాలు చేసుకొని స్థిర నివాసం ఏర్పరచు కున్నారు. అందులో భాగంగానే అంగన్వాడీ కేంద్రం, డిపో బిల్డింగ్ నిర్మాణానికి నాంది పలికారు. అలాగే ఏకలవ్య స్కూల్ నిర్మాణానికి భూమి కేటాయించడంలో కీలక పాత్ర పోషించారు.

కాంట్రాక్టర్లతో జీవీఎంసీ ఇంజినీర్లు కుమ్మక్కవడం విచారకరం

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: కాంట్రాక్టర్లతో జీవీఎంసీ ఇంజనీర్లు చేతులు కలిపి కార్మికుల హక్కులు కాలరాస్తుండడం విచారకరమని జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వి.వి.వామనరావు అన్నారు. జీవీఎంసీలో గత 12 ఏళ్లుగా వీధి దీపాలు, సెంట్రల్ లైటింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న 65 మందిని అమాంతంగా తొలగించడాన్ని నిరసిస్తూ గాంధీ విగ్రహం వద్ద జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. యూనియన్ అధ్యక్షుడు వి.వి.వామనరావు మాట్లాడుతూ ఇంతవరకు జీవీఎంసీ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న వీరిని అమాంతంగా వేద తొలగించి బివిఎస్ఆర్ అనబడే ఏజెన్సీ సంస్థలో విధులు నిర్వహించాల బదలాయింపు, కచ్చితంగా చర్యలుగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బివిఎస్ఆర్ సంస్థకు ఏడు సంవత్సరాలకు సుమారు 100 కోట్లు వెచ్చించి నిర్వహణ బాధ్యతలు అప్పగించిందని అన్నారు. ఇపుడు ఈ తొలగించిన సిబ్బందిని వారికి అప్పగిస్తుండడం వెనుక కుట్ర కోణాలు అర్థం కావడం లేదన్నారు. నగరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా అధికార యంత్రాంగంది పూర్తి బాధ్యత వహించాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుమ్మడి నర్సింగ్, ట్రెజరర్ పోలరావు,వీధి దీపాల హెల్పర్స్ టెక్నీషియన్స్ సంఘ నాయకులు డింగి మహేష్, శ్రీను, జగపతి బాబు, దేవుడు, బాబు, ప్రేమ్, యర్రాజ్, సురేష్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మందులు పంపిణీ

విశాలాంధ్ర – ఆనందపురం: మండలంలో 98% నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ గంగు నాయుడు పేర్కొన్నారు. గురువారం జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా తర్లువాడ జడ్పీహెచ్ పాఠశాలలో మండల పరిషత్ అధ్యక్షురాలు డాక్టర్ మజ్జి శారదా ప్రియాంక, వైస్‌ఆర్పిపి మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటప్పల ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.గంగు నాయుడు, ఆనందపురం ఎడ్యుకేషన్ ఆఫీసర్ యన్.గంగరాజు పాల్గొని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా వేయించడం జరిగింది. ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 15 సచివాలయాలలో 16708 పిల్లలకు గాను 16341 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ షహనాజ్ సాదియా, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, పాఠశాల యాజమాన్యం ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రెంటోకిల్ పిసిఐ తెగులు నియంత్రణ సేవలు బలోపేతం

విశాలాంధ్ర – విశాఖ సిటీ: తెగులు నియంత్రణలో తన నైపుణ్యానికి ప్రశంసలు అందుకున్న భారతదేశపు ప్రముఖ తెగులు నియంత్రణ మరియు పరిశుభ్రత సేవల సరఫరాదారు అయిన రెంటోకిల్ పిసిఐ ఇటీవల తెగులు బస్టర్స్ సముపార్జనతో తన మార్కెట్ స్థానాన్ని బలోపేతం చేసుకుంది. ఈ సముపార్జనలో పెస్ట్ బస్టర్స్ యొక్క వినియోగదారుల సమాచారం, ప్రతిభావంతులైన వృత్తినిపుణులు మరియు విలువైన ఆస్తులు ఉన్నాయని సంస్థ ప్రతినిధి చెప్పారు. విజయవాడలో ప్రధాన కార్యాలయం ఉన్న పెస్ట్ బస్టర్స్, కుటుంబాలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించుటకు తెగులు నియంత్రణ పరిష్కారాల సమగ్ర శ్రేణి కొరకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో ప్రామాణికమైన కీర్తిని అందుకుందని డేవిడ్ లెవిస్, మేనేజింగ్ డైరెక్టర్, రెంటోకిల్ పిసిఐ, ఈ సముపార్జన గురించి వ్యాఖ్యానించారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఏపిఈపిడిసిఎల్ వద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నాలో పోరాట కమిటీ చైర్మన్ పి.సుదర్శన్ రెడ్డి, జనరల్ సెక్రటరీ వి.సుబ్బిరెడ్డి, కన్వీనర్ వి.శివయ్య, జె.శ్రీనివాసరావు, వి. సత్యనారాయణ, ఆర్.సత్యారావు, పి.చంద్రశేఖర్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి. కుమార్, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వడాల రమణ, మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్స్ యూనియన్ నాయకులు అప్పారావుతో పాటు 5జిల్లాల నుండి పెద్ద ఎత్తున విద్యుత్ పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. ఏపిఈపిడిసిఎల్ వద్ద జరిగిన ధర్నాలో నాయకులు మాట్లాడుతూ ఛవర్ జెఎసి కాంట్రాక్ట్ కార్మికుల నోట్లో మట్టికొట్టిందని విమర్శించారు. అనంతరం ఏపీ ఈపీడీసీఎల్ సిఎండికి వినతిపత్రం అందజేశారు.

నామినేషన్లు దాఖలు

విశాలాంధ్ర – హుకుంపేట: ఉప ఎన్నికల్లో భాగంగా మండలంలోని శోభకోట పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి ఎన్నికల కు గురువారం 5 నామినేషన్లు దాఖలు రిటర్నింగ్ అధికారి శెట్టి సంజీవరావుకు అంద జేశారు. అనంతరం ఓల్డా, మతం, బూరమని వార్డు సభ్యుల ఎన్నికలకు వేరు వేరుగా నామినేషన్లు మొత్తం ఆరుగురు దాఖలు చేశారని తెలిపారు.

వార్డు మెంబర్ల రీ ఎలక్షన్‌కు నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర – చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు మండలం లోని కొత్తపల్లి, తుమ్మల గ్రామపంచాయతీలోని వార్డు మెంబర్ల రీ ఎలక్షన్ సంబంధించి నామినేషన్ లు రిటర్నింగ్ అధికారికి శుక్రవారం సమర్పించారు. ఈ కార్యక్రమంలో చింతూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇల్ల చిన్నారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మట్టెల వెంకటేశ్వర్లు, మండల ప్రధాన యూత్ కార్యదర్శి శీలం తమ్మయ్య, కర్లం లక్ష్మణ్, కుంజా బాలకృష్ణ, మీడియం కొండయ్య, మడకం ప్రకాష్ రావు, తుర్రం బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర – రాజవొమ్మంగి: రాజవొమ్మంగి ఎంపిపి స్కూల్ నందు యూటిఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా జరిపారు.

మండలాధ్యక్షుడు డి.పైడిపల్లి, ప్రధాన కార్యదర్శి పి.రమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. యూటిఎఫ్ జెండాను రాష్ట్ర కౌన్సిలర్ ఎం.ఈయర్ ఆవిష్కరించారు. అనంతరం యూటీఎఫ్ విధి విధానాల కోసం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోషియల్ అధ్యక్షుడు బి సుబ్బారావు, ప్రసన్న, కోశాధికారి కె.శ్రీను, జిల్లా కౌన్సిలర్ వి.వెంకటలక్ష్మి, మిరియాల శ్రీను, జంపా రాంబాబు, లింగలి కొండబాబు, గుమ్మడి సూర్యనారాయణ, దివి గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ అప్పగింత

విశాలాంధ్ర – హుకుంపేట: మండలంలోని సంతరి పంచాయతీ చిన్నబురుగు పుట్టు గ్రామానికి చెందిన కంబ సత్యవతి అనే గిరిజన మహిళ అరకులోయ మండలం చొంపి గ్రామానికి చెందిన సత్యారావు అనే వ్యక్తికి పెళ్లి అయింది. ఆమెకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. మతిస్థిమితం లేక 15 ఏళ్ల క్రితం రాజస్థాన్ రాష్ట్రానికి వెళ్లిపోయిన సత్యవతి 15 ఏళ్లుగా బిచ్చగాళ్లుగా తిరుగుతు ఉండగా గుర్తించిన పోలీసులు ఆమెను మాట్లాడించగా తెలుగు మాట్లాడంతో ఆమె వివరాలు తెలుసుకున్నారు. గిరిజన ప్రాంతం విశాఖ జిల్లా మన్య ప్రాంతం అని వివరాల ఆధారిగా తెలుసుకుని పోలీసులు సహకారంతో హుకుంపేట మండల పోలీసు స్టేషన్‌లో చేర్పించి గురువారం స్థానిక ఎస్ఐ జ సతీష్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు, స్థానిక సర్పంచ్ పాడి అప్పలనాయుడు, గ్రామ వాలంటరి లక్ష్మణ్, గ్రామ పెద్ద సింహాద్రికు అప్పగించారు.

సర్పంచ్‌ల నిధుల మళ్లింపు తగదు

విశాలాంధ్ర – భీమిలి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ దగ్గుబాటి పురందేశ్వరి పిలుపుమేరకు విశాఖ జిల్లాలో మహిళా కళాశాల ఎదుట గ్రామ సర్పంచులకు కేంద్రం ప్రభుత్వం ఇస్తున్నటువంటి నిధులు మళ్లింపును ఖండిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మహా నిరసన చేపట్టారు. విశాఖ జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో విశాఖ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు వి.వి.వి.ప్రసాదరావు పట్నాయక్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 100 మందికిపైగా బీజేపీ కిసాన్ మోర్చా కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం మండల పార్టీ అధ్యక్షులు మీసాల రాము నాయుడు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి లెంక గ్రామ్, కనకల పరమయ్య, ఉపాధ్యక్షులు పొట్నూరు కృష్ణారావు, సారిక ప్రకాష్, కే.పేర్రాజు, బంక సీతం నాయుడు, బుత్తల రాజు, పోతిన జీవన్ సంతోష్, పొన్నాడ గురయ్య, విశాఖ జిల్లా కిసాన్ మోర్చా సర్వవర్గం సభ్యులు హాజరయ్యారు.

నులిపురుగుల నివారణకు సహకరించండి

విశాలాంధ్ర – చింతపల్లి: నులిపురుగులు వ్యాప్తి వలనే పిల్లలలో రక్తహీనతలేమి ఏర్పడుతుందని తద్వారా వ్యాధి నిరోధక శక్తి కోల్పోయే ప్రమాదం ఉందని, అందువలన ప్రభుత్వం సరఫరా చేసే నులిపురుగుల నివారణ మాత్రలను 3 నుంచి 19 ఏళ్ల బాల, బాలికలచే క్రమం తప్పకుండా మింగించాలని నులిపురుగుల నివారణ ఆర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వెంకట మహేష్ అన్నారు. జాతీయ నులిపురుగుల

నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంతర్ల, పెంటపాడు, దిన్నగడ్డ, గడపరాయి, మల్లవరం, కందుల గాడే, చుంచుపల్లి, వైబీ నగర్, పాతకాలనీ ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలలో ఆ శాఖ సిబ్బందితో సందర్శించి విద్యార్థిని, విద్యార్థులచేత నులి పురుగుల నివారణ మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఆరోగ్య కార్యకర్తలు ఏఎన్ఎం లు లోసారి లక్ష్మమ్మ, ఉబ్బా రమణమ్మ, కొర్రా విజయలక్ష్మి, సాగిన వరలక్ష్మి, పెంటి కుమారి, ఎంఎల్ హెచ్ పి లు దీప్తి, శ్రీవాణి, హెల్త్ అసిస్టెంట్లు సత్యారావు, లక్ష్మణరావు, సచివాలయ కార్యదర్శి మహిళా సంరక్షకులు బాకూరు ప్రశాంతి, వెల్ఫేర్ అసిస్టెంట్ లిల్లీ గ్రేస్, పాఠశాల ఉపాధ్యాయులు గెమ్మెలి కామేశ్వరరావు, సాగిన చిలకమ్మ, సిహెచ్ రాధాకృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.